# శోభనాద్రి శోభనం!

ఎట్టకేలకు శోభనాద్రికి పెళ్ళైంది!

వాడికసలు పెళ్ళి రాతలేదేమోని కన్నవారు తల్లడిల్లారు. ఏళ్ళ తరబడి కుళ్ళి కుళ్ళి ఏడ్చారు.

లేకలేక కలిగిన ఏకైక సంతానం శోభనాద్రి. ఒక్కగానొక్కడనే ప్రేమతో కాలు కింద పెట్టనీయకుండా అపురూపంగ పెంచారు. కష్టమంటే ఏమిటో తెలీకుండా పెరిగాడు శోభనాద్రి. కొండమీది కోతి కావాలని మారాం చేసినా తెచ్చి ఇచ్చేటందుకు పేరెంట్స్ సిద్ధపడేవారు.

శోభనాద్రికి అన్నీ వున్నయ్... అయిదోతనం తప్ప!... అనేసి ఫ్రెండ్స్ ఏడిపించటం చూస్తూ పళ్ళికిలించి పకపకా నవ్వటం తప్పించి మనిషి ఉడుక్కునేవాడు కాదు.

శోభనాద్రి పర్సనాలిటి... అందం... చెలాకీతనం... చూచి ఆడపిల్లలు వెంటపడేవారు. శోభనాద్రి చిరునవ్వు కోసం... స్నేహంకోసం అర్రుల చాచి పిచ్చోళ్ళయిన ఆడపిల్లలు కోకొల్లలు.

కొందరు ఆడపిల్లలు ఎన్నిరకాలుగ ప్రయత్నాలు చేస్తున్నా... 'ప్రేమ' అనే పదానికి పది ఆమడల దూరం మెయిన్‌టెయిన్ చేస్తాడు. మనిషి ఉలకడు. పలకడు... కనీసం ఆడపిల్లలవైపు కన్నెత్తి అయినా చూడడు.

ఫ్రెండ్స్ తనను గేలిచేస్తున్నారనే విషయం తెలిసీ పట్టించుకునేవాడు కాదు. అది అతగాడి నేచర్.

ఇట్లా సిగ్గుపడే సన్నాసివి... పెళ్ళేం చేసుకుంటావ్?... రేపు నీ భార్య అయినా నిన్ను దగ్గరకు రానిస్తుందిర్రా?... నువ్ మగాడివి! పైగా మీ బాబుకి నువ్వొక్కడివే! బంగారు పిచ్చుకవి! కాలేజీకి కార్లో వస్తున్న స్థోమత కలవాడివి!... లవ్ చేయమంటూ నువ్ ఏ ఆడపిల్ల కాళ్లమీదైనా పడవలసిన అవసరం లేనివాడివి... ఎంచేత అంటే... ఆడపిల్లలే వెర్రి వ్యామోహంతో నీచుట్టూ తిరుగుతున్నారు కాబట్టి! కాలేజీలో గరల్స్ అంతా 'ప్రేమో-ప్రేమో'ని నీ వెంట పడుతుంటే నువ్వేంట్రా మడికట్టుకు చలనంలేని శిలాప్రతిమలా వుంటావ్... కేంటీన్లో శోభనాద్రి చుట్టూ చేరిన స్నేహితులు కాకుల్లా పొడిచారు.

ట్రెండ్ మార్చుకోకపోతే నీకు తిప్పలు తప్పవురోరేయ్... హెచ్చరిక జారీ చేశారు.

ఉడత వూపులకు చింతకాయలు రాలవన్నట్లు ఇందరు ఇన్నిరకాలుగా

ఆడిపోసుకుంటున్నా... నోటికొచ్చినట్టు తిడుతున్నా శోభనాద్రికి చీమకుట్టినట్టయినా లేదు.

మనిషి మారడు! మనసూ మారదు! ప్రేమ వ్యవహారం గురించి శోభనాద్రితో ఎన్నిసార్లు డిస్కస్ చేసినా మార్పు రావటంలేదని తెల్సుకున్న ఫ్రెండ్స్... వాగటం ఆపి నోళ్ళు మూసుకున్నారు.

'మీకు రోజూ ఫ్రీగా కేంటీన్లోనే కాదు ఏ స్టార్ హోటళ్ళనైనా కాఫీ టిఫిన్లు ఇప్పిస్తాను. మిమ్మల్ని అందరినీ వారానికోమారు బార్‌కో పబ్‌కో నా కార్లో తీసుకెళ్ళి పీకలవరకు తాగించి తినిపిస్తాను. ఎప్పుడు పడితే అప్పుడు మీరుకోరిన పిక్చర్ చూపిస్తాను. పోనీ పేకాడదామంటే రెడీ!... ఇంకా ఇంకా మీరేం కోరితే అది చేయటానికి సిద్ధం!... అంతేగానీ... అమ్మాయిల వెంట పడమని ప్రేమించమనీ నన్ను పోరకండి! మీకు పుణ్యముంటుంది. వచ్చే జన్మలో చచ్చి మీ కడుపునపుట్టి ఇంకా మిగిలిపోయిన రుణమేదైనా వుంటే తీర్చేసుకుంటాను...' ఫ్రెండ్స్ కాళ్ళా వేళ్ళాపడ్డాడు శోభనాద్రి.

'వీడేంట్రా లవ్ చేయరా బాబూ అంటూంటే... పరుగెట్టి పారిపోతానంటాడు? తడిగుడ్డ వేసుకుని మడికట్టుకుని వుండిపోవటానికే సిద్ధపడుతున్నాడు...' పక్కనే వున్న ఫ్రెండ్ సింహాద్రి టాపిక్ ఓపెన్ చేశాడు.

'నాకేదో అనుమానంగా వుందిరా... వీడిని లాక్కెళ్ళి మెడికల్ ఎగ్జామినేషన్ చేయిస్తేగాని అసలు కారణం బైటపడదు...' ఇంకో ఫ్రెండు మహేశ్వరరావు హేళనగా మాట్లాడాడు.

'ఛీ! నోర్ముయ్. వీడొట్టి పిరికిగొడ్డు!- ఆడపిల్లను చూస్తేచాలు చిటికినవేలు చూపుతాడు. అంతేరా... సర్ది చెప్పబోయాడు శేషావతారం.

'మరి వీడిని మనదారికి తెచ్చి లవ్ బురదలో పడేయటం ఎట్లారా బాబూ?...' బుర్ర గోక్కున్నాడు రామారావ్.

'కొందరంతే! ఇలాంటి శాడిస్టులను వాళ్ళ ఖర్మ కొదిలేయాలి! వీళ్ళని మార్చటం పుట్టించిన దేవుడివల్ల కూడా కాదు...' లోకం చదివినవాడిలా మాట్లాడేడు మహేష్.

'నన్ను ఎదురుగా వుంచుకునే రకరకాలుగా కామెంట్లు చేస్తున్నారా?... నా వుప్పు తింటూ నన్నే ఎగతాళి చేస్తున్నారు. మీరు మిత్రద్రోహులురా?'- చిరుకోపం శోభనాద్రి మాటల్లో చోటుచేసుకుంది.

'నిన్ను విమర్శించటంకంటే మాకేం పనుంది. డిస్కషన్స్ పక్కకు పెట్టి వేడివేడి సమోసాలు లాగిద్దామా?-' ఇదే తగిన సమయంగ భావించి అన్నాడు అన్సారీ.

'మీక్కావలసింది ఆర్డరిచ్చుకోండి! తిన్నంత తిని బిల్లు మాత్రం నాకివ్వండి! ఏం?' ఆనందంగ శలవిచ్చాడు శోభనాద్రి.

'నువ్వే కదురా మా ఇలవేల్పు! నీవే ఆపదమొక్కులవాడివి... మా కేపిటలిస్టువి...' కామెడీ చోటుచేసుకుంది రమేష్ మాటల్లో.

'మీరు నన్ను ములగచెట్టు ఎక్కించినా... అక్కడినుండి 'ఢాం'ని పడదోసినా బాధపడను... కానీయండి... ఎవరికేం కావాలో ఆర్డరిచ్చి పీకలవరకు మెక్కండి. నాకేం భయంలేదు...'

★ ★ ★ ★ ★

శోభనాద్రి ఎం.బి.ఏ. చేశాక... ఎవరి దగ్గరో వుద్యోగం చేయాల్సిన ఖర్మ కొడుక్కేం పట్టిందని తన ఫ్యాక్టరీకే ఎం.డి. చేయాలనుకున్నాడు.

ఒకరోజున కాఫీ తాగుతూ 'ఒరే శోభనం...నిన్ను మన కంపెనీకి ఎం.డి. చేద్దామను కుంటున్నాను. అటు ఎం.డి.... ఇటు ఛైర్మన్ రెండు పదవులూ ద్విపాత్రాభినయం చేయటం కష్టంగ వుంది! కన్న కొడుకువి నువ్వు చేతికి అందివచ్చాక ఎం.డి. పదవి నీకు కట్టబెట్టటమే సరైన నిర్ణయమన్పించింది.- నేనెట్లాగూ కంపెనీ ఛైర్మన్‌గ కొనసాగుతాను. ఏమంటావ్?-'

'డాడీ! నేనిప్పుడే చదువు పూర్తిచేసినవాడిని! అనుభవంలేనివాడిని! అంత పెద్ద పోస్ట్ నేను నిర్వహించగలనాని' డౌట్ వెలిబుచ్చాడు శోభనాద్రి.

'చేస్తుంటే అనుభవం అదే వస్తుంది! పైన నేనున్నాను విషయాలన్నీ పూసగుచ్చినట్టు వివరించటానికి.- నీ కింద ఆఫీసర్లు... అధికారులు... ఇతరమైన స్టాఫ్ చాలామంది వున్నారు. వాళ్ళే నీకు అన్నీ నేర్పిస్తారు. డోన్ట్‌వర్రీ!

'సరే డాడీ!... మీ ఇష్టం!'

'కొద్దిరోజులు నావెంట కంపెనీకి వస్తూండు. వింటూ చూస్తూ వుంటే విషయాలు త్వరగానే గ్రహిస్తావ్. కనుక... బోర్డు డైరెక్టర్స్‌తో ఓ మాట చెప్పి మంచిరోజు చూసి నిన్ను ఎం.డి. ఛైర్లో కూర్చోపెడతాను...'

పదిరోజులు తండ్రితోపాటు ఫాలో అయితేనే తనకు చాలా విషయాలు తెల్సుకోగలిగాననే కాన్ఫిడెన్స్ డెవలప్ అయింది శోభనాద్రిలో!

ఏడాది గడిచేసరికి ఫ్యాక్టరీ... మేనేజ్‌మెంట్ వ్యవహారాలన్నిటినీ తన గుప్పెట్లోకి తీసుకోగలిగేడు.

కొడుకు తెలివితేటలు... వర్క్ ఇన్వాల్‌మెంట్... కళ్ళారా చూస్తూ శోభనాద్రి తండ్రి తెగ మురిసాడు.

ఒకరోజు రాత్రి... రాఘవయ్య కాళ్ళొత్తుతూ 'ఏమండీ... శోభనంగాడి చదువు పూర్తైంది. మన కంపెనీకి ఎం.డి. చేశారు... వాడి పెళ్ళి మాటేమిటి? ఏమాలోచించారూ?-' భర్త

నడిగింది రాజేశ్వరి.

'చూడూ! పెళ్ళి చేసుకోవలసింది వాడు! వాడి మనసేమిటో... ఆలోచనేమిటో నువ్వు అడిగి తెల్సుకో!... ప్రేమలో పడి వుండకపోతే... మంచి సంబంధం చూచి ఖాయం చేద్దాం!...' తన కోర్టులో బంతిని భార్య కోర్టులోకి నెట్టాడు.

'వాడు అలాంటివాడు కాదండీ! నాకు బాగా తెల్సు! వాడ్ని కన్నతల్లిని... మనవాడికి అంత ధైర్యం కూడానా!' నవ్వింది రాజేశ్వరి.

'ఎందుకైనా మంచిది... ఓమారు అడిగి చూడు! లైన్ క్లియరైతే... మినిస్టర్ గారి సంబంధం రెడీగా వుంది...' ఆవులిస్తూ అన్నాడు రాఘవయ్య.

'మంత్రిగారితో సంబంధం అంటే... కట్నం కనీసం ఒక కోటైనా ఇయ్యకపోతాడాని...'

'నోరు ముయ్యవే! మనకేం తక్కువని? వ్యాపారంలో కోట్లు ఆర్జించాను. మనకున్నది శోభనాద్రి ఒక్కడు. మనకున్నది చాలదా ఏం?...'

'అబ్బే ఊరికే అన్నాను...'

'ఆయన మంది నోళ్ళు కొట్టి సంపాదించిన పాపిష్టి డబ్బు మనకెందుకే! పిల్ల లక్షణంగా ఉంటే చాలు. ఈడు జోడు... జాతకాలు కుదిరితే చాలు!- అయినా ఆయన స్థాయికి తగ్గట్టుగానే పెళ్ళి జరిపిస్తాడు! ఒక్కగానొక్క కూతురే గనుక కెజీల కొద్దీ బంగారం వంటినిండా వుండనే వుంటుంది. ఆయన కూడబెట్టేదంతా ఆ పిల్లకేగా దక్కేదీ...'

'అయితే ఇంకేం పిల్లనొచ్చి చూస్తామని కబురు పంపండి... వెళ్ళి చూసొద్దాం...'

'కొడుకుతో నువ్ మాట్లాడవా?-'

'అడిగితే ఇప్పుడే వద్దంటూ వాయిదాలు వేస్తాడు. మనతో రమ్మంటే తోకాడించుకుంటూ వస్తాడు. చెవిపుచ్చుకు లాక్కెళ్ళచ్చు...'

'వాడిప్పుడు పెద్ద ఎం.డి. హోదాలో వున్నాడే?-'

'వర్కర్లకు... కంపెనీకి ఎం.డి.గాని కన్నతల్లికి కాదుగా?!- వాడు నా మాట జవదాటడు...'

'తీరా పిల్లని చూచి నచ్చలేదంటే... నా పరువు మర్యాదలు గంగపాలౌతయ్...'

'ఈ సంబంధం కుదిరితే... షిర్డీసాయిబాబాకి బంగారు సింహాసనం... వేంకటేశ్వరస్వామికి బంగారు శంఖుచక్రాలు చేయిస్తానని మొక్కుకున్నానండీ మనసులో!

'అవునా!?- అయితే ఇంకేం?!... దేవుడి దయవల్ల మంత్రిగారితో వియ్యమందుకోవటం ఖాయం...' అనేసి వత్తిగిలి పడుకున్న రాఘవయ్య నిద్రలోకి

జారిపోయాడు.

అప్పటిదాకా భర్త చెవిలో జోరీగైన రాజేశ్వరికి రాత్రంతా కంటిమీద కునుకేలేదు.

★★★★★

సిగ్గు బిడియాన్ని పక్కకునెట్టి తలెత్తి శోభనాద్రిని నఖశిఖపర్యంతం శల్యపరీక్ష చేసినట్టు... కొరుక్కుతినేలా చూస్తోంది మంత్రిగారి కూతురు సౌమ్య.

కుర్రాడు కత్తిలా వున్నాడు అనుకుంది మనసులో! ఫారిన్లో చదువుకుని వచ్చిన సౌమ్య సగం ఇండిన్... మిగతా హాఫ్ అమెరికన్ లక్షణాలున్న ఆడదిలా అవుపించింది శోభనాద్రి కళ్లకు.

బాబ్డ్‌హెయిర్... పెదాలకు లిప్‌స్టిక్... స్లీవ్‌లెస్ జాకెట్... తీర్చిదిద్దిన కనుబొమలు... చక్కటి కోల్గేట్ టూత్‌పేస్ట్ యాడ్‌లో దర్శనమిచ్చే సుందరాంగికున్నట్టు చక్కటి పలువరుస... చిరునవ్వు చిందించే వ ఖం... చీరెకట్టులో సౌమ్య అందాలు చిందిస్తున్నా... గంగిరెద్దులా వంటినిండా దిగేసిన నగలు చూస్తుంటే పైనా కిందా (మెడదాకా) 'మేచైన'ట్టు అవుపించలేదు శోభనాద్రి కళ్లకు.

మొత్తానికెలాగో సౌమ్య శోభనాద్రి ఒకరినొకరు చూసుకుని ఓ.కే. చేసుకున్నారు.

అంగరంగవైభవంగ వారి వివాహం జరిగింది!

'హమ్మయ్య! మొత్తానికి మనవాడు ఒకింటివాడైనాడు...' సంతృప్తి పడ్డారు రాఘవయ్య రాజేశ్వరి.

తరువాయి అంకం శోభనం!

అసలు ప్రాబ్లమ్ అక్కడే మొదలైంది.

శోభనం అనేమాట శోభనాద్రి చెవినపడగానే గుండె వేగం పెరిగింది. వళ్ళు చెమటలు పట్టింది! వద్దంటే రసాభాసవుతుందేమో?... అవునంటే... ప్రాణాంతకంగ మారుతుందేమోరా దేవుడాని... మథనపడసాగేడు.

శోభనాద్రి... శోభనం గదిలోకి... దుర్యోధనుడు మయసభలోకి ప్రవేశించినట్టు ఎంటరైనాడు.

డబుల్‌కాట్ బెడ్డు... ఫోమ్ బెడ్డు... పిల్లోలు... మంచం చుట్టూ మల్లెపూలదండలు... అగరొత్తుల వాసన... రూమ్‌ఫ్రెషనర్ విరజిమ్మే పరిమళం... బెడ్ పక్కనే ఒక ప్లేట్లో యాపిల్... ద్రాక్షవంటి ఫలాలు... మరో ప్లేట్లో స్వీట్లు... ఇలాంటి సీను చాలా సినిమాల్లో చూశాడుగానీ... పర్సనల్‌గ చూడటం ఇదే తొలిసారి కావటంతో మనిషి బిత్తరపోయి కంగారుపడ్డాడు.

బెడ్‌మీద కూర్చున్న శోభనాద్రి గుండెలో దడ! గదిలోని హంగు ఆర్భాటానికి అదిరి బెదిరిపోయాడు. ఇక అమ్మడొచ్చి (సారీ... సౌమ్య) పాటలు పాడటమే తరువాయి... డ్యూయట్ పాడుదామంటుందేమో కొంపదీసి?- తనకు సాంగ్స్ రావే?!- ఎలా?

ముత్తైదువలు సౌమ్యని గదిలోకి తొయ్యకుండానే... చేతిలో పాలగ్లాసు లేకుండానే ఎంటర్‌ది డ్రాగన్‌లో బ్రూస్‌లీలాగ గుడ్లు మిటకరించి చూస్తూ... గదిలోకొచ్చి ఠక్కున తలుపేసి గడియపెట్టింది.

ఓరి నాయనోయ్... కొత్త పెళ్ళాం ఈ రాత్రికి తన భరతం పట్టేట్టుందని మనసులో కంగారుపడినా తన బలహీనత బహిర్గతం కాకుండా జాగ్రత్త పడ్డాడు శోభనాద్రి.

నెక్ట్స్ స్టెప్పేమిటో... తానేం చేయాలో తోచక బుర్ర గోక్కున్నాడు.

వీడేం మొగుడ్రా బాబూ... వట్టి అదురుగొడ్డులా చూపులేగానీ... వచ్చి కౌగలించుకుని ... ముద్దులు కురిపించి... బెడ్‌మీద ఎత్తి పడేయడేం అనుకోలేదు సౌమ్య.

మెల్లగా శోభనాద్రిని సమీపించి తామర తూడుల్లాంటి చేతులతో... లేలేత బెండకాయల్లాంటి వేళ్ళతో భర్తని తాకింది. సిగ్గుతో తలవంచుకోకుండానే నవ్వింది.

సిట్యుయేషన్ గ్రహించుకోలేని శోభనాద్రి వెర్రిమొహం వేశాడు! కానీ... సౌమ్య చేతి స్పర్శ తన శరీరానికి తగలటంతో కరెంట్ పాసైనట్టు...సుతారంగా వీణ తంత్రులను మీటినట్టయింది.

కమాన్ డియర్! ఇలాంటివన్నీ ఇండియాలోనే... అందుకే నూతన వధూవరులు బెదిరిపోతుంటారు. ఫారిన్లో ఇవేమీ వుండవ్. హనీమూన్ ట్రిప్‌లో అన్నీ అర్థమౌతయ్. కార్యక్రమం ముగుస్తుంది... అని చెప్తే శోభనాద్రి తననెక్కడ అపార్థం చేసుకుంటాడాని నోరు మెదపలేదు సౌమ్య!

తనకు ప్రాపంచిక విషయాలన్నీ తెల్సు! కానీ... ఈ వ్యవహారం నడపటంలోనే కాస్తంత పూర్! అందుకే ఈ దడ... బెదురు... తలపోశాడు మనసులో.

ఇక లాభం లేదనుకున్న సౌమ్య తనే భర్తకు దగ్గరై... బిగికౌగిట్లో బంధించి ముద్దులిచ్చేసరికి... గాలిపోయిన బెలూన్‌లా వున్న శోభనాద్రి షాక్‌కి గురై కళ్ళు తిరిగి దభీమని నేలమీద పడిపోయాడు.

అనూహ్య పరిణామానికి అవాక్కయింది సౌమ్య!

- సమాప్తం -